క్లుప్తంగా

శింగరకొండలో ఆడిట్ అధికారి పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న జిల్లా ఆడిట్ అధికారి

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం బాపట్ల జిల్లా ఆడిట్‌అధికారి మారెళ్ల భాగ్యరావు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి పంచహారతుల కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవస్థాన అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

డ్రైనేజీ కాదు రహదారే!



మురుగునీటితో రాకపోకలకు ఇబ్బందిగా మారిన రైల్వేగేటు రహదారి

చీరాల టౌన్: అది నిత్యం వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రైల్వేగేటు రహదారి. రైతులు, వివిధ ప్రాంతాలకు రైళ్లలో వెళ్లే ప్రయాణికులు, పలు గ్రామాలకు వెళ్లే ప్రజలు రవాణా సాగించే సీతారాం పేట రైల్వే గేటు రోడ్డు. మండలంలోని ఈపురుపాలెం గ్రామ పంచాయతీలోని రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు, బోయినవారిపాలెంకు చెందిన ఐటీసీ కార్మికులు రాకపోకలు సాగించే ఈ రోడ్డు డ్రైనేజీ నీటితో నిండిపోయింది. సీతారాం పేట నుంచి రైల్వే గేటు వరకు రోడ్డు మొత్తం మురుగు నీటితో నిండిపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రజలు వదలిన నీటితో ఈ రోడ్డు డ్రై నేజీ రోడ్డుగా మారిందని వాహనదారులు చెబుతున్నారు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

ఫలరాజుకు కల్తీ జబ్బు

- మామిడి పండ్లను రసాయనాలతో మాగబెడుతున్న వ్యాపారులు
- రంగు చూసి మోసపోతున్న ప్రజలు
- తింటే అనారోగ్యం తప్పదు



రసాయనాలతో మాగబెట్టిన మామిడి పండ్లు

వేటపాలెం: అందరూ ఇష్టపడే మామిడి పండ్లు మార్కెట్‌లోకి నెమ్మదిగా వచ్చేస్తున్నాయి. అయితే ఇంకా పక్వానికి రానప్పటికీ కొందరు వ్యాపారులు త్వరగా ఆదాయం సమకూర్చు కోవాలని అత్యాసతో పండ్లను రసాయానాల్లో మాగబెడుతూ అమ్మకాలు సాగిస్తున్నారు. ఇలాంటి పండ్లు తినడం వల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. చీరాల నియోజకవర్గం పరిధిలో వేటపాలెం, పందిళ్లపల్లి ప్రాంతాల్లో మామిడి తోటలు సుమారు 120 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. వీటిని వ్యాపారులు లీజుకు తీసుకొని వ్యాపారలావాదేవీలు సాగిస్తున్నారు.

సంప్రదాయాన్ని మార్చారు

గతంలో మామిడి తోటల రైతులు స్వయంగా తోటలను సాగు చేసుకొని పక్వానికి వచ్చిన ముదురు కాయలను మాత్రమే కోసి సంప్రదాయ పద్ధతుల్లో మాగబెట్టి మార్కెట్లకు తరలించేవారు. కానీ ప్రస్తుతం తోటలను లీసుకు తీసుకొన్న వారు పచ్చిగా ఉన్న కాయలనే కోసి మార్కెట్‌లకు తరలిస్తున్నారు. వాటిని రసాయనాలతో మాగ బెట్టి చిరు వ్యాపారులకు, తోపుడు బండ్ల వారికి విక్రయిస్తున్నారు.

రంగు చూసి తింటే అనారోగ్యం తప్పదు

మామిడి కాలయలకు మంచి రంగు రావడానికి కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగిస్తున్నారు. ఇలాంటి పండ్లు తింటే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. తల తిరగడం, దాహం వేయడం, చికాకు కలగడం, వాంతులు, విరేచనాలు, చర్మ సమస్యలు, కాన్సర్ కారక లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు హెచ్చరి స్తున్నారు.

అధికారుల జాడేదీ..

గతంలో చీరాల ప్రాంతంలో ప్రధాన మార్కెట్‌లో నిల్వ చేసే కాయలను అధికారులు పరీక్షించే వారు. ప్రస్తుతం మార్కెట్‌కు విచ్చల విడిగా రసాయనాలతో పండించిన మామిడి పళ్లు వస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఇప్పటి కైనా ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మార్కెలో విక్రయించే మామిడి పండ్లను పరీశీలించి రసాయనాలతో పండించే వారిపై కఠిన చర్యలు తీసు కోవాలని ప్రజలు కోరుతున్నారు.

> **అలాంటి పండ్లు తినకూడదు**
>
> 
>
> సంప్రదాయ రీతిలో మాగ బెట్టిన మామిడి కాయలను మాత్రమే తినాలి. రసాయనాలతో కృత్రిమంగా మాగబెట్టిన కాయలను తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఎక్కువగా వాంతులు, విరేచనాలు , చికాకు, చర్మ సమస్యలు కనిపిస్తాయి. ప్రాణాంతకంగా కూడా మారవచ్చు.
>
> – స్వాతి కిరణ్, వైద్యాధికారి, వేటపాలెం

పల్లెపాలెంలో బోట్ల గణన



మత్స్యకారుల బోట్ల వివరాలను సేకరిస్తున్న మత్స్యశాఖ సిబ్బంది

చినగంజాం: మండలంలోని పల్లెపాలెం గ్రామంలో సముద్రంలోవేట నిర్వహించే బోట్ల గణన కార్యక్రమాన్ని మత్స్యశాఖాధికారులు నిర్వహించారు. పల్లెపాలెం సముద్ర తీరంలో బోటు యజమానులు, కళాశీలు కలిసి వారు వేట చేస్తున్న బోట్లతో కలిపి మత్స్యశాఖకు వివరాలను అందజేశారు. ఒక్కొక్క బోటుకు సంబంధించి వేట నిర్వహించే సభ్యులతో కూడిన ఫొటోలను సైతం సిబ్బంది తీసుకున్నారు. కార్యక్రమంలో పల్లెపాలెం మత్స్యకారుల సొసైటీ ప్రెసిడెంట్ దండుప్రోలు శ్రీరాములు, కార్యదర్శి వాటుపల్లి నాగూరుబాబు, గ్రామ సర్పంచ్ సైకం మణి, గ్రామ కాపులు దండుప్రోలు నారాయణ, దండుప్రోలు తిరుమలరావు, ఐలా శ్రీను, గ్రామ పెద్దలు రాములు, శ్రీను పాల్గొన్నారు.

కన్నుల పండువగా గాయత్రి మహాయజ్ఞం

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు కాలువ సెంటర్ సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద రాయినీడి భాస్కరరావు, దగ్గుబాటి రాజాబాబు స్థలంలో శుక్రవారం 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. గురువారం నుంచి ప్రారంభమైన ఈ యజ్ఞ కార్యక్రమాల్లో 108 కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. హరేరామ ఆశ్రమ పీఠాధిపతుల ఆశీస్సులతో నిర్వహించిన ఈ శోభాయాత్రను ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 150 మంది దంపతులు పాల్గొన్నారు.



గాయత్రి మహా యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

పొగాకు రైతులతో చర్చలు

పర్చూరు(చినగంజాం): పర్చూరులోని పొగాకు రైతులతో రైతు సంఘం నాయకులు శుక్రవారం చర్చలు జరిపారు. మండలంలోని పర్చూరు, చిన నందిపాడు, అడుసుమల్లి గ్రామాలకు చెందిన పలువురు పొగాకు రైతులను పర్చూరు బొమ్మల సెంటర్‌లో వారు కలిసి బర్లీ పొగాకు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కౌలు రైతు సంఘాల రాష్ట్ర నాయకులు వి. కృష్ణయ్య, ఎం. హరిబాబు, జిల్లా నాయకులు సీహెచ్ గంగయ్య, బండి శంకరయ్య తదిరులు పాల్గొన్నారు.



పొగాకు రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘ రాష్ట్ర నాయకులు

21న వక్ఫ్ సవరణ బిల్లుపై నిరసన ర్యాలీ

వేటపాలెం: వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లింలు ఈ నెల 21వ తేదీ నిరసన ర్యాలీ చేయనున్నట్లు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు దేశాయిపేట పంచాయతీ రామానగర్ మసీదు వద్ద నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ జరగనుందని తెలిపారు. అన్ని గ్రామాల్లోని ముస్లింలు పాల్గొని నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

వృద్ధాశ్రమానికి బీరువా వితరణ

పర్చూరు(చినగంజాం): పర్చూరులోని ఆశ్రయ వృద్ధాశ్రమానికి పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ మేనల్లుడు కొమ్మాలపాటి మనోజ్ కుమార్ పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకొని బీరువా బహూకరించారు. అనంతరం ఆశ్రమంలోని 30 మంది వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు ధూళిపాళ్ళ సత్యనారాయణ, పంబి సదానందరెడ్డి, కోట శ్రీనివాసరావు, కొల్లా సుబ్బారావు, కారుమూడి సుబ్బారెడ్డి, నాగభైరు శ్రీనివాసరావు, కోడూరి సుబ్రహ్మణ్యాచారి, భవనం రాజగోపాలరెడ్డి, దొప్పలపూడి శేషబాబు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.



బీరువా బహూకరిస్తున్న తోకల కృష్ణమోహన్



చీరాల: ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు శిలువతో ర్యాలీ



కారంచేడులో ఏసుక్రీస్తు శిలువను మోసే సన్నివేశంలో మహిళలు, యువకులు

పాపుల రక్షణకే క్రీస్తు మరణం

- భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు
- కిటకిటలాడిన క్రైస్తవ మందిరాలు



మేదరమెట్ల రహేబోతు ప్రార్థనా మందిరంలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



చెన్నుపల్లిలో ప్రార్థనలు

చీరాల రూరల్: ప్రభువైన క్రీస్తు పాపాలను క్షమించేందుకు.. శిలువ మరణం పొందారని, ఆయన లోకానికి వెలుగైయున్నాడని పలువురు పాస్టర్లు పేర్కొన్నారు. గుడ్ ఫ్రైడే వేడుకలు చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో నిర్వహించారు. ఉదయం 10 గంటలకు అన్ని చర్చిల పాస్టర్లు ఆరాధనా క్రమాలను జరిపించారు. క్రీస్తు శిలువలో మరణం పొందిన మధ్యాహ్నం మూడు గంటల వరకు ప్రార్థనలు నిర్వహించారు. ఆ సమయంలో ఆయన శిలువలో పలికిన ఏడు మాటలను విపులీకరించారు. ఆయన శరీరాన్ని మాత్రమే మానవులకు అప్పగించారని ఆత్మను పరమ తండ్రికి అప్పగించారని చెప్పారు. క్రీస్తు ప్రేమ, జాలి, దయ, మంచి హృదయం కలవారని, ఆయన మనపై చూపిన ప్రేమ ఆప్యాయతలను మనం కూడా ఇతరుపై చూపాలని సందేశంలో పేర్కొన్నారు. స్థానిక చర్చి కాంపౌండ్‌లోని సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి (పెద్దచర్చి)లో పాస్టర్లు రెవరెండ్స్ పిల్లి దేవదాసు, పోకూరి నానిబాబు, గిఫ్టీ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం యూత్‌వారు వీనులవిందైన సంగీతాల మధ్య దేవుని గీతాలను ఆలపించారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో థామస్‌పేట యూత్ ఆధ్వర్యంలో ప్రార్థనలకు హాజరైన విశ్వాసులకు చల్లని మజ్జిగ అందజేశారు. చర్చి చైర్మన్ దేటా అశోక్‌కుమార్, ట్రెజరర్ పేర్లి ఆనంద్, పీసీసీ, ఎల్‌సీసీ, యూత్ సంఘస్తులు పాల్గొన్నారు. అలానే సెయింట్ మార్క్స్ లూథరన్ పేరాల బ్రాంచ్ చర్చి, జాన్‌పేటలోని సెయింట్ జాన్స్ పారిష్ చర్చి, ఉజిలీపేటలోని సెయింట పీటర్స్ చర్చి, శాంతినగర్, ఐక్యనగర్, విఠల్‌నగర్‌లోని మన్నా చర్చి, బేర్ పేట, సాల్మన్ సెంటర్, సిపాయిపేటలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ప్రత్యేక ఆకర్షణగా శిలువధారి దృశ్యాలు

స్థానిక మరియమ్మ పేటలోని సెయింట్ ఆంథోని క్యాథలిక్ చర్చి (ఆర్సీఎం) చర్చి ఆధ్వర్యంలో ఆరోజుల్లో ఏసుక్రీస్తును రోమన్లు ఏవిధంగా శిలువ మోయించి చిత్రహింసలకు గురిచేశారో.. అదే విధంగా కళ్లకు కట్టే విధంగా శిలువ దృశ్యాలతో ర్యాలీ నిర్వహించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి ఆర్సీఎం చర్చి వరకు నిర్వహించిన దృశ్యాలు ఆకర్షణగా నిలిచాయి. పలువురు క్రీస్తును తలచుకొని కన్నీటి పర్యంతమయ్యారు.

కారంచేడులో ఆకట్టుకున్న శిలువ ధ్యాన యాత్ర


కారంచేడు: సర్వలోక మానవుల పాపాలను హరించి, వారికి రక్షణ భాగ్యం అందించేందుకు లోక రక్షకుడు ఏసుక్రీస్తు శిలువ మరణాన్ని రుచి చూడాల్సి వచ్చిందని లూర్దుమాత చర్చి ఫాదర్ విజయ్‌సందదీప్ రెడ్డి బోధించారు. శుక్రవారం మండల కేంద్రమైన కారంచేడు లూర్ధుమాత (మరియమ్మ తల్లి) చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గుడ్ ఫ్రైడే (శుభ శుక్రవారం) ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం నూతలపాటి రాహుల్‌కు ఏసుక్రీస్తు వేషధారణలో ఆయన శిలువ మరణానికి ముందు శిలువ యాత్ర ద్వార అనుభవించిన శ్రమలు, ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన యూదా జనాంగంతో ఆయన పలికిన ఏడు మాటలు, వాటి సాదృశ్యమైన వాక్య సందేశం అందించారు. ఆర్‌సీఎం చర్చి నుంచి బందెలదొడ్డి బజారు, రామాలయం వీధి, లైబ్రరీ సెంటర్, చినవంతెన సెంటర్ మీదుగా పెద జబారు నుంచి చర్చి వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మహిళలు, చిన్నారులు ఆలపించిన క్రైస్తవ కీర్తనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం క్రీస్తును శిలువ వేసే సన్నివేశాన్ని చూపించారు. దీంతో అక్కడ ఉన్న క్రైస్తవ మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. మండలంలోని కుంకలమర్రు, స్వర్ణ, ఆదిపూడి, కొడవలివారిపాలెం, నందిగుంటపాలెం, జరుబులవారిపాలెం, తిమిడెదపాడు, దగ్గుబాడు (ఏఈఎల్‌సీ) గ్రామాల్లోని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ఫాదర్లు ఫాదర్ జోసఫ్‌తంబి, ఫాదర్ డేవిడ్, సిస్టర్లు, క్రైస్తవులు, సంఘస్తులు, తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడి: సర్వమానవాళి పాపాలను హరించి వారిని పునీతులను చేసేందుకే లోకరక్షకుడైన ఏసుక్రీస్తు శిలువ మరణం పొందాడని రెవరెండ్ రిచర్డ్ పచ్చ అన్నారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే పండుగను పురస్కరించుకొని పలు గ్రామాల్లోని క్రైస్తవులు ఉపవాసాలతో ప్రార్థనలు జరుపుకున్నారు. యద్దనపూడిలోని ఎపిఫానియా క్రీస్తు లూథరన్ చర్చి, పూనూరులోని ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు.


వేటపాలెం: సర్వమానవాళి పాప పరిహారం కోసం క్రీస్తు ప్రభువు సిలువను మోసి తన రక్తం చిందించి సిలువపై మరణమొంది తిరిగి మూడో రోజు లేచారని ఆర్‌సీఎం చర్చి గురువు టి. కరుణాకర్ పేర్కొన్నారు. ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే సూచికంగా ఆనాడు ఏసు ప్రభువు శిలువను మోస్తూ పొందిన శ్రమలను కళ్లకు కట్టినట్లుగా పురవీధుల్లో ప్రదర్శించారు. ప్రపంచంలోని క్రైస్తవ ప్రజలు 40 రోజుల పాటు ఎంతో పవిత్రంగా భక్తి శ్రద్ధలతో ఉపవాసాలు ఆచరించే ఈ శిలువ మార్గం ప్రత్యేక ఆకర్షణంగా ఉంది. రోమన్ క్యాతోలిక్ మిషన్ గురువు టి. కరుణాకర్, జేయంజే సిస్టర్స్ ప్రకాశమ్మ, మాజీ ఏఎంసీ చైర్మన్ మార్పు గ్రెగోరీ, రాజమ్మ, పెద్దలు మార్పు జార్జి, చేగూడి జాన్సన్, బీమవరపు అలెక్స్, మారువ రోశయ్య, మార్పు బాలజేసు, మార్పు సుధాకర్, పిల్లి ఆదయ్, సలగల ప్రకాష్, ప్రదీప్, మేడికొండ శేషగిరిరావు, పెర్లి దావీదు, రాజారావు, ఆర్‌సీఎం యువత శ్యామ్ దిలీప్, సురేష్, చిన్న, నాని, సన్నీ, అబ్రహం పాల్గొన్నారు.

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని చర్చిల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మేదరమెట్ల గ్రామంలోని రోహెబోతు ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలం నలుమూలల నుంచి హాజరైన ప్రజలు ప్రార్థనలను జరిపారు. ఏసు భక్తి గీతాలను ఆలపించారు. దార్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బల్లికురవ: ఏసుక్రీస్తు ప్రజల పాపావిమోచనానికి శిలువపై ప్రాణ త్యాగం చేశారని పాస్టర్‌లు బండారు సురేష్ కుమార్, గీతా మాధురి, సుబ్బారావు అన్నారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు మండలంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొణిదెన, వల్లాపల్లి, మల్లాయపాలెం, కొప్పరపాలెం, కూకట్లపల్లి, కొప్పరపాడు, చెన్నుపల్లి, ఉప్పుమాగులూరు, గ్రామాలో చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. పాస్టర్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.



చీరాల: సందేశం అందిస్తున్న రెవరెండ్ దేవదాసు



చీరాల: ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన క్రైస్తవ విశ్వాసులు



యద్దనపూడిలో వాక్యోపదేశం చేస్తున్న రెవరెండ్ రిచర్డ్ పచ్చ



కారంచేడులో క్రీస్తు శిలువను గర్తు చేసేలా సన్నివేశం



వేటపాలెం: శిలువ మోస్తున్న మాజీ ఏఎంసీ చైర్మన్ మార్పు గ్రెగోరీ

రాకపోకలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

బల్లికురవ: స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో రోడ్లపై వ్యాపారాలు చేస్తూ రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని ఎస్సై నాగరాజు వ్యాపారులను హెచ్చరించారు. శుక్రవారం మాట్లాడుతూ నాలుగు రోడ్ల కూడలి చుట్టూ రోడ్లపైనే వ్యాపారాలు చేయటం బైక్‌లు, ఆటోలు నిలపటం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులతో పాటు ట్రాఫిక్ జామ్ అవుతోందని ఎస్సై చెప్పారు. సిమెంట్ రోడ్ మార్జిన్ నుంచి ఆరడుగుల అవతలే వ్యాపారాలు చేసుకోవాలని, కానీ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎవరి దుకాణాల ముందు వాహనాలు ఆగితే అందుకు ఆ దుకాణదారుడే బాధ్యత తీసుకోవాలని హెచ్చరించారు.

ప్రతిభా మూర్తుల కార్యక్రమం నేడు

అద్దంకి: చిన్న శాంతయ్య పిచ్చిమ్మ సేవా సదన్‌లో శనివారం సాయంత్రం 6.30 గంటలకు ప్రతిభా మూర్తులు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పీసీహెచ్ కోటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి మారుతీరావుగురించి కవి చందలూరి నారాయణరావు ప్రసంగిస్తారిని తెలిపారు. సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు హాజరు కావాలని కోరారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల: మహిళల్లో ఆర్థిక స్వావలంబన, ఆత్మగౌరవం సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శుక్రవారం చీరాల మండలం తోటవారిపాలెం సచివాలయం-2లో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిందన్నారు. మహిళల్లో నైపుణ్యాభివృద్ధిని పెంచే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కుట్టుమిషన్ నేర్చుకునే మహిళలు క్రమం తప్పకుండా హాజరై తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు.

ప్రసన్నాంజనేయుడి వార్షిక తిరునాళ్ల రేపు

బల్లికురవ: మండలంలోని వెలమవారిపాలెం గ్రామసమీపంలో వేంచేసిఉన్న ప్రసన్నాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీవారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటల నుంచే ప్రసన్నాంజనేయునికి పంచామృతాలతో అభిషేకం, తమలపాకులతో అర్చన, ప్రత్యేక అలంకరణ, అన్నసంతర్పన చేపట్టనున్నట్లు చెప్పారు. రాత్రికి భారీ ఎలక్ట్రిక్ ప్రభతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వేడుకలో గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం చైత్ర మాసం పూర్వాషాఢ నక్షత్రం షష్టి తిధి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తేకోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీసువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.